నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శనివారం 7 డిసెంబర్ 2024 | MEDAK

## ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

చేర్యాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, డిసెంబర్ 6: కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ సమయంలో ప్రజల విశ్వాసం కోల్పోయిందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం చేర్యాలలో అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన అవకాశంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని తెలిపారు. నేటి యువత అంబేద్కర్ అడుగు జాడల్లో పయనించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హైదరాబాద్‌లో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పూలమాలలు వేసి నివాళులర్పించలేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతల మీద దాడులు పెరిగిపోతున్నాయని, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, పోలీసులు చట్టాలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు, నిర్బంధాలను ఛేదించి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు చింతల పరశురాములు, కొత్త దొమ్మాట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక భాస్కర్ ఏర్పాటు చేసుకున్న లక్ష్మీ ఆప్టికల్స్ విజన్ ఐ కేర్‌ను సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, బద్దిపడిగె కృష్ణారెడ్డి, వుల్లంపల్లి కరుణాకర్, కౌన్సిలర్ మంగోలు చంటి, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం, మంద యాదగిరి, తలారి కిషన్, సుంకరి మల్లేశం, పెడుతల ఎల్లారెడ్డి, శివగారి అంజయ్య, జింకల పర్వతాలు యాదవ్, గద రాజు చందు, వకులాభరణం నర్సయ్య పంతులు, బూరగోని తిరుపతి గౌడ్, పచ్చిమడ్ల సిద్దిరాములు, కోతి దాసు, యాట భిక్షపతి, భూమిగారి రాజేందర్, అవుశర్ల కిశోర్, కొంగరి గిరిధర్, అకుల రాజేశ్‌గౌడ్, పచ్చిమడ్ల మానస, తాడెం రంజితా కృష్ణమూర్తి, మీస పార్వతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణానికి చెందిన వ్యాపారి దిడిగం నర్సింహులు కుమారుడి విహావానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై ఆశీర్వదించారు.

## కోహెడ గురుకులంలో కలెక్టర్ తనిఖీ

కోహెడ, డిసెంబర్ 6: సిద్దిపేట జిల్లా కోహెడలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం సాయంత్రం కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట సామాగ్రి, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం నాణ్యతలో ఎలాంటి రాజీపడవద్దని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వంటల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ పాల్గొన్నారు.

కోహెడ గురుకుల పాఠశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

# నాడు బీజం.. నేడు ఫలం!

## వర్గల్, ములుగు మండలాల్లో పారిశ్రామిక ప్రగతి.. బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమల ఏర్పాటుకు చేయూత

- కేసీఆర్ కృషి ఫలితంగా పరిశ్రమల స్థాపనకు భూమిపూజ
- రెండేండ్ల క్రితమే కోకాకోలా కంపెనీకి ముహూర్తం.. ఇటీవల ప్రారంభం
- మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న మరిన్ని పరిశ్రమలు
- నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- సాకారమవుతున్న కేసీఆర్ ఆశయం

ములుగు మండలం బండతిమ్మాపూర్‌లో ఇటీవల ప్రారంభించిన కోకాకోలా కంపెనీ

గజ్వేల్, డిసెంబర్ 6: బీఆర్ఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా గజ్వేల్ ప్రాంతం పరిశ్రమల స్థాపనకు అనువుగా మారింది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అందించిన సహకారంతో భూమిపూజ చేసిన భారీ పరిశ్రమలు ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు మండలం బండతిమ్మాపూర్‌లో రూ. 2091 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన హిందుస్థాన్ లివర్ కోకాకోలా బేవరేజస్ కంపెనీ ఇటీవల పారంభమైంది. ఈ కంపెనీలో వేలాది మందికి ఉపాధి లభించనున్నది. కేసీఆర్ హయాంలో తునికి బొల్లారం, వర్గల్, బండమైలారం టీఎస్ఐఐసీ పార్కుల్లోనూ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించడంతో పారిశ్రామికవేత్తలు, కంపెనీలు ముందుకు వచ్చాయి. రూ. వందల కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అవన్నీ ప్రారంభం కానున్నాయి. దీంతో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంతో నిర్వాసితులుగా మారిన భూబాధిత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్ ప్రాంతంలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించింది. ములుగు, వర్గల్ మండలాలు హైదరాబాద్‌కు అతి చేరువలో ఉండడం, బీఆర్ఎస్ ప్రభుత్వం చేయూతనివ్వడంతో చాలామంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చారు. ఈ ప్రాంతంలో ప్రధానంగా కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటును కేసీఆర్ ప్రోత్సహించారు. అందులో భాగంగా 2022లో బండతిమ్మాపూర్‌లో కోకాకోలా కంపెనీ పనులు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రారంభయ్యాయి. కోకాకోలా కంపెనీని 49ఎకరాల విస్తీర్ణంలో రూ.2091కోట్లతో అప్పట్లో భూమిపూజ చేశారు. ఇందులో సుమారు 1000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ కోకాకోలా పరిశ్రమకు కేసీఆర్ నిర్మించిన కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచే గోదావరి జలాలను వినియోగిస్తున్నారు. వర్గల్ మండలం అవుసులోనిపల్లి, వర్గల్, శాకారం గ్రామాల పరిధిలో 1200 ఎకరాల భూమిని పరిశ్రమల ఏర్పాటు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించింది. ఈ భూముల్లో బీఆర్ఎస్ హయాంలో పారాబాయిల్డ్ రైస్‌మిల్లులు, అమూల్ ఐస్‌క్రీమ్ కంపెనీ ఏర్పాటు పనులు అప్పట్లో ప్రారంభించారు. ఆ పనులు కొనసాగుతున్నాయి.త్వరలోనే ఇవి ప్రారంభం కానున్నాయి. దీంతో మరింత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

### కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపేనా...

ములుగు, వర్గల్ మండలాల్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా పరిశ్రమల స్థాపనకు సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ ఎంతో కృషిచేశారు. ఆనాడు ముందు కొచ్చిన పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు భూమిపూజ చేయగా, నేడు ఆ పరిశ్రమలు ప్రారంభమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా గజ్వేల్ నియోజకవర్గానికి ఒక్క పరిశ్రమను కొత్తగా తేలేదు. గతంలో పరిశ్రమల ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం ముందుకొస్తే కాంగ్రెస్ నాయకులు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేయించి అడ్డుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కేసులను ఛేదించి పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తుందా లేదో చూడాలి.

## నిరంకుశ పాలన తలపిస్తున్న సర్కారు

హైదరాబాద్ గచ్చిబౌలిలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇంటి ఎదుట పోలీసులు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, డిసెంబర్ 6: రేవంత్ సర్కారు మరో నిజాం నిరంకుశ పాలనను తలపిస్తున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని స్థానిక పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఎమ్మెల్యే ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. పోలీస్ నిర్బంధంలో ఉన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక మీడియాతో ఫోన్‌లో మాట్లాడారు... రేవంత్ సర్కారు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో రజాకారుల పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, హామీలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి, అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న రేవంత్ సర్కారుకు బుద్ధి చెప్పే సమయం దగ్గర పడిందని కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కాంగ్రెస్ నాయకుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయిందని విమర్శించారు.

## ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు

### కాంగ్రెస్ సర్కారుపై సిద్దిపేట బీఆర్ఎస్ నేతల ధ్వజం

సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, డిసెంబర్ 6: బీఆర్ఎస్ అంటేనే కాంగ్రెస్ సర్కార్ భయపడుతున్నదని సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దరిపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయకులు గంధం రాజు, ఆదాబ్ మెహిజ్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ పాలన అంటే నిర్బంధమేనా అని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయాలనే కాంగ్రెస్ ఇలాంటి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నదని పేర్కొన్నారు. పోలీసులను అడ్డు పెట్టుకుని సీఎం రేవంత్ నిర్బంధ పాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజాపాలన విజయోత్సవాలు కాకుండా నిర్బంధ పాలన విజయోత్సవాలు నిర్వహించాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకుడు చక్రధర్ గౌడ్ దొంగనోట్ల కేసులో, ఉద్యోగాల పేరుతో అమాయక యువతను మోసగించిన కేసులో నిందితుడని, ఆలాంటి వాడు ఫిర్యాదు ఇస్తే హరీశ్ రావు పైన కేసు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

## సంగారెడ్డికి నవోదయ విద్యాలయం మంజూరు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 6: కేంద్ర ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాకు నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి సంగారెడ్డికి నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించినా ఫలితం రాలేదు. ఎట్టకేలకు సంగారెడ్డి జిల్లాకు నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో బీఆర్ఎస్ నాయకుల కృషి ఫలించినట్లైంది. నవోదయ విద్యాలయం ఏర్పాటుతో జిల్లాలోని పేద విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందే అవకాశం ఉంది. జిల్లాలో నవోదయ విద్యాలయం ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

## మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హౌస్ అరెస్టు

కొంపల్లిలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

మెదక్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): మెదక్ మాజీ ఎమ్మెల్యే, మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డిని పేట్ బషీరాబాద్ కొంపల్లి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఎమ్మెల్యేలు, పార్టీ నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ బీఆర్ఎస్ శ్రేణుల అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయి. అర్ధరాత్రి నుంచే నాయకులను హౌస్ అరెస్టులు చేయడంతో పాటు అదుపులోకి తీసుకుంటున్నారు. శుక్రవారం మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని పేట్ బషీరాబాద్ కొంపల్లి పోలీసులు కొంపల్లిలోని ఆమె నివాసంలో హౌస్ అరెస్టు చేశారు.

## హోంగార్డు సేవలు కీలకం

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ ఎస్పీని శాలువాతో సన్మానిస్తున్న హోంగార్డులు

మెదక్ అర్బన్, డిసెంబర్ 6: పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలకమని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో భాగమై పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ హోంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. హోంగార్డు వ్యవస్థ పోలీస్ శాఖలో కీలకంగా మారందిని అన్నారు. శాంతిభద్రతలు, ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతాయుతమైన సేవలు అందించడంతో పాటు మహారాష్ట్ర ఎన్నికల బందోబస్తులో అప్పగించిన బాధ్యతలు నిబద్ధతో నిర్వహించారన్నారు. సమస్య ఉన్నా నేరుగా కలవవచ్చని, తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీనటి శ్రీలీల, సంస్థ యజమానులు రాజమౌళి, వెంకటేశ్వర్లు

## సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రారంభం

- ఆర్సీపురంలో సందడి చేసిన శ్రీలీల
- భారీగా తరలివచ్చిన అభిమానులు.. జోష్ నింపిన సినీతార

రామచంద్రాపురం, డిసెంబర్ 6: సినీతార శ్రీలీల శుక్రవారం ఆర్సీపురంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో సందడి చేసింది. ఆర్సీపురంలోని జాతీయ రహదారిని ఆనుకొని నూతనంగా ఏర్పాటు చేసిన 37వ సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌ను ఆమె ప్రారంభించింది. సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ సంస్థ యజమానులు వెంకటేశ్వర్లు, రాజమౌళి, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం అనంతరం సినీతార శ్రీలీల షాపింగ్ మాల్‌లో కలియతిరిగి ఫస్ట్, సెకండ్ తదితర ఫ్లోర్‌లను సందర్శించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని సారీ కౌంటర్ వద్దకు వచ్చి చీరలను మీడియా ముందు ఆవిష్కరించారు. సంస్థ డైరెక్టర్లు సురేశ్ సీర్ణ, అభినయ్, రాకేశ్, కేశవ్ కస్టమర్లకు స్వాగతం పలికారు. సంస్థ డైరెక్టర్ సురేశ్ మాట్లాడుతూ.. బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం వాసులు కోరుకునే నాణ్యతకు, నవ్యత్వానికి పెద్దపీట వేస్తూ వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు. సంస్థ డైరెక్టర్ అభినయ్ మాట్లాడుతూ.. పర్వదినాలకు, భారతీయ సంప్రదాయ కలెక్షన్లకు తమ షోరూమ్ కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. సంస్థ డైరెక్టర్ రాకేశ్ మాట్లాడుతూ.. తమ షోరూమ్ అన్నిరకాల వస్త్రాలకు ధరల్లోనూ, నాణ్యతలోనూ వస్త్రప్రియుల అభిరుచులను ప్రతిబింబిస్తుందని తెలిపారు. సంస్థ డైరెక్టర్ కేశవ్ మాట్లాడుతూ.. వైవిధ్యభరితమైన వస్త్రాలను కోరుకునే కొనుగోలుదారులకు ప్రతి వెరైటీని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సినీతార శ్రీలీల మాట్లాడుతూ.. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 37వ బ్రాంచ్‌ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సౌత్ ఇండియా మాల్స్ ప్యాన్ ఇండియాకి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. సౌత్ ఇండియాలో సరసమైన ధరలకే వినియోగదారులు షాపింగ్ చేయవచ్చని, పండుగలు, శుభకార్యాలకు సౌత్ ఇండియాలోనే షాపింగ్ చేయాలని కోరారు. అక్కడి నుంచి శ్రీలీల మాల్ బయట ఏర్పాటు చేసిన స్టేజీ వద్దకు వచ్చి అభిమానులతో మాట్లాడి వారిలో జోష్ నింపారు. అభిమానులను ఉత్సాహపరుస్తూ మాట్లాడారు. అందాల తారను వారి ఫోన్‌ల్లో బంధించేందుకు అభిమానులు ఆసక్తి చూపారు. పలువురు ఆమెతో సెల్ఫీలు దిగారు. ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పానగేశ్, ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకుల ఆర్తనాదాలు!

- కనీస ఉద్యోగ భద్రత లేకుండా విధులు
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్

### సంగారెడ్డి జిల్లాలో 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఆరు నెలలుగా అందని వేతనాలు



విద్యార్థులకు బోధిస్తున్న అతిథి అధ్యాపకుడు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 6: ఉన్నత విద్యాశాఖలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఆరు నెలలుగా వేతనాలు రాక పస్తులుండాల్సి పరిస్థితి ఏర్పడింది. అరకొర వేతనాలతో సేవలందిస్తున్న అతిథి అధ్యాపకులకు సమయానికి వేతనాలు అందక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన జూన్ వేతనంతో పాటు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూలై నుంచి నవంబర్ వరకు మొత్తం 6 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 90 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 34 మంది విధులు నిర్వహిస్తుండగా, పటాన్‌చెరు ప్రభుత్వ కళాశాలలో 19 మంది, నారాయణఖేడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 9 మంది, జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 10 మంది, జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 12 మంది, సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇద్దరు అతిథి అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరంతా జూలై మొదటి వారంలో తిరిగి నియామకం అయ్యారు. అప్పటికే విధుల్లో పీజీ అధ్యాపకులకు జూన్ మాసానికి సంబంధించిన వేతనాలు ఇప్పటికీ విడుదల కాకపోవడం శోచనీయం. ఇంటర్మీడియట్ అతిథి అధ్యాపకులకు నెలకు రూ.42 వేలు, డిగ్రీ అతిథి అధ్యాపకులు నెలకు రూ.50వేల వేతనం చెల్లిస్తామని మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని అతిథి అధ్యాపకులు మండిపడుతున్నారు. ఇచ్చిన మాట మేరకు అతిథి అధ్యాపకులు రూ. 50వేల వేతనంతో పాటు కన్సాలిడేట్ వేతనాలను ఇవ్వాలని, రెగ్యులర్ అధ్యాపకులు వచ్చే వరకు తమ ఉద్యోగాలను భేషరతుగా రెన్యువల్ చేయాలని ప్రభుత్వాన్ని అతిథి అధ్యాపకులు డిమాండ్ చేస్తున్నారు. ఒక తాత్కాలిక ఉద్యోగి స్థానంలో మరొక తాత్కాలిక ఉద్యోగిని నియమించరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు తాత్కాలికులైన కాంట్రాక్ట్ అధ్యాపకులు బదిలీపై వచ్చినా అతిథి అధ్యాపకులను ఇంటికి పంపించడం సరికాదంటున్నారు. ఇప్పటికే ఏడాదికి కనీసం ఆరు నెలల పూర్తి వేతనం కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మేనిఫెస్టో అమలు ఎక్కడా?

మా జీవితాలు బాగుపడతాయని ప్రజా పాలన ప్రభుత్వాన్ని నమ్ముకుంటే పస్తు లుండాల్సిన పరిస్థితి తలెత్తింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు అతిథి అధ్యాపకులకు రూ. 50వేల కన్సాలిడేటెడ్ వేతనాలు ఇస్తామ ని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఆ ఉసేలేదు. వేతనాలను సకాలంలో అందించాలి.

– దేవేందర్, రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు

### మా సేవలను గుర్తించండి..



సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో 8 ఏండ్లుగా వరుసగా సేవలందించాను. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశాను. ప్రస్తుత ఏడాది ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నాను. సమయానికి వేతనాలు అందడం లేదు. ఉద్యోగం ఏటా రెన్యువల్ చేసి, కన్సాలిడేటేడ్ వేతనాలు ఇవ్వాలి.

– బి.నవీన్ కుమార్, కామర్స్ అతిథి అధ్యాపకుడు

### 6 నెలల వేతనాలు రావాలి



కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అతిథి అధ్యాపకుల వేతనాలను విడుదల చేయాలి. 6 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. జూన్ నుంచి నవంబర్ వరకు బడ్జెట్‌ను విడుదల చేసి అందుకు సంబంధించిన ఆథరైజేషన్ వెంటనే ఇవ్వాలి. వేతనాలు సకాలంలో రాక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం.

– రమేశ్, కంప్యూటర్ అతిథి అధ్యాపకుడు

### వేతనాలు రాక అప్పుల పాలు



ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సేవ చేస్తున్నామనే సంతృప్తి తప్పా కుటుంబ పోషణ భారంగా మారింది. నెలనెలా వేతనాలు రాక అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. వెంటనే మా వేతనాలు విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన మాట ప్రకారం నెలకు రూ.50వేల వేతనాన్ని కన్సాలిడేటెడ్‌గా చెల్లించాలి. కనీస ఉద్యోగ భద్రత కల్పించి మా జీవితాలకు భరోసా కల్పించాలి.

– శ్రీనివాస్, కామర్స్, అతిథి అధ్యాపకుడు

## రసవత్తరంగా రాష్ట్రస్థాయి క్రీడలు

కబడ్డీ అండర్-17లో మొదటి స్థానంలో నిలిచిన మహబూబ్‌నగర్ జిల్లా జట్టు

వర్గల్, డిసెంబర్ 6: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో రెండో రోజు శుక్రవారం రాష్ట్ర స్థాయి క్రీడలు రసవత్తరంగా కొనసాగాయి. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఆయా జిల్లాల బాలికల గురుకుల పాఠశాలల నుంచి మొత్తం 1400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్14, అండర్17, అండర్19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన అండర్17 కబడ్డీ పోటీలో మహబూబ్‌నగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, అండర్19 కబడ్డీ పోటీలో మెదక్ జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచింది. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు.